# అహోహా

ఎ.వి.కనకదుర్గ

పెళ్ళై ఏడాది కావస్తున్నా నిత్య, నితిన్ జంట కన్నుల పండుగగా, చూడముచ్చటగా వుంటుంది. 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా వుంటారు ఇద్దరూ! మా బెడ్ రూమ్ కిటికీ లోంచి చూస్తే వాళ్ల హాల్ క్లియర్‌గా కనిపిస్తుంది. ప్రతిరోజు వాళ్లిద్దరు కారమ్స్, కార్డ్స్... వగైరా గేమ్స్ ఆడుతూ, ఏవో జోక్స్ కట్ చేసుకుంటూ హాయిగా, నవ్వుతూ సంతోషంగా ఈవినింగ్స్ స్పెండ్ చేస్తుంటారు.

నా కళ్లు ప్రతిరోజూ నా ప్రమేయం లేకుండా వాళ్లని కనిపెడుతుండేవి. ఆ ప్రయత్నంగా నాకదో హాబీలాగా దినచర్యగా మారిపోయింది. వాళిద్దర్ని అలా హాయిగ... సంతోషంగా చూస్తుంటే నా మనస్సెందుకో ఉల్లాసంగా ఉండేది. అలవాటు ప్రకారం సాయంత్రం కిటికీ లోంచి వాళ్ల హాల్‌కేసి చూడసాగాను. ఆశ్చర్యం! ఎప్పటిలాగా వాళ్లు నవ్వుతూ ఆనందంగా లేరు! పైగా ఎడమొగం... పెడమొగంగా ఉన్నారు. ఆమె అతన్ని చూసి మొహం వాచేస్తోంది. ఇద్దరి మొహాలలో అదోమాదిరి విచారం గలగలా నవ్వుతూ సంతోషంగా వుండే వారి మౌనానికి హాలు మూగబోయినట్లయింది. వారిని కని పెడుతున్న నేను చాలా ఫీల్ అయ్యాను. ఎందుకలా ఉన్నారు? తెల్సుకోవాలని ఆరాట పడసాగాను. చీకటి పడింది. వాళ్ల ప్రవర్తనకి కారణం తెలియక... ఎంత ఆలోచించినా అర్థంగాక బుర్ర వేడెక్కింది నాకు. అన్య మనస్కంగా నిద్రకుపక్రమించాను నేను.

• • •

నితిన్ ఆమెని చావబాదుతున్నాడు "వద్దండి ప్లీజ్... కొట్టకండి..." ఆమె ఏడుస్తోంది. "నోర్ముయ్ రాస్కెల్" అని అతను ఆమెని జుట్టు పట్టుకొని నాలుగు బాదాడు. "అమ్మో" అన్న కేకతో నేను ఉలిక్కిపడి నిద్రలేచాను. తెలతెలవారుతోంది అంటే... నేను కలగన్నానన్న మాట. భగవాన్ పగటి కలలు నిజమౌతాయంటారు. కానీ... కానీ ... నా కలని కల్లలు చేయి తండ్రి!

వారి అన్యోన్యతను కడదాకా కళకళలాడుతూ వుండాలి స్వామి" అని వేడుకున్నాను. అవినాభావ సంబంధమంటే ఇదేనేమో! వాళ్లకీ నాకు సంబంధం లేకపోయినా వారి అన్యోన్యత పట్ల నాకు ఆరాటం! ఆలోచన లతో తెల్లారిపోయింది. ఎందుకో ఆరాటంతో వాళ్లింటికేసి చూశాను. నిత్య కళ్లాపి చల్లి ముగ్గు పెడుతుంది. ఆమె కళ్లు బాగా ఎర్రగా వుబ్బి ఉన్నాయి. మాటిమాటికీ కళ్లు తుడుచుకొంటుంది. "ప్చ్! నా కల నిజమైంది. భగవంతుడు నా మొర ఆలకించలేదు... అతడామెని చావ బాదేసి నట్టున్నాడు! స్టుపిడ్స్ మగవాళ్లనందుకే నమ్మకూడదంటారు పెద్దలు! నిన్నటిదాకా చిలకా గోరింకల్లా వున్న వాళ్లు... ఇప్పుడు ఇలా ఎందుకింత గొడవొచ్చిందసలు? ఆమె చెయ్యరాని పనేమైనా చేసిందా? నో! నో! వీల్లేదు. ఆమె అలాంటిది కాదు... అసలు ఆ రాస్కెల్‌కి ఆమెని కొట్టడానికి చేతులెలా వచ్చాయి? ఇంట్లో పెద్ద దిక్కెవరు లేరని ధీమా... తనిష్టం వచ్చినట్లు ఆ అమాయకపు పిల్లని బాదుతాడా! ఈ విషయాన్నిలా వదలడానికి వీల్లేదు. పొరుగు ఇంటిదాన్ని ఏమైతే కానీ నేనీ విషయంలో కలుగజేసుకొని అతనికి బుద్ధి చెప్పాలని నిశ్చయించుకొని అన్యమనస్కంగా ఇంటి పన్లన్నీ అరకొరగా ముగించుకొని నా ఇంటికి తాళం పెట్టాను. 'నిత్య' వాళ్లు నాకు పెద్దగా పరిచయం లేకపోయినా చొరవచేసి వాళ్ల కాలింగ్ బెల్ కొట్టాను. రెండు క్షణాలు తర్వాత ఆమె తలుపుతీసింది. పాలరాతి బొమ్మలా మెరిసిపోతున్న ఆమెని చూసి 'అబ్బ ఎంత అందంగా ఉంది' అని అనుకోకుండా ఉండలేకపోయాను. ఎప్పుడూ లేనిది ఆమె కొత్తగా 'కూలింగ్ గ్లాసెస్' పెట్టుకుంది. ఆ గ్లాసెస్ ఆమెకెంతో సూటయ్యాయి. వాటితో ఆమె అందం రెట్టింపైనట్టుంది. 'హూ! ఆ గ్లాసెస్ వెనుక కథ నాకు తెలుసమ్మా! ఏడ్చి వచ్చిన నీ కళ్లు నాకు కనబడకుండా దాచుకొంటున్నావా పిచ్చితల్లి! ద్రాష్టుడు... ఇంత అందమైన పిల్లపైన చెయ్యి చేస్కోడానికి మనసెలా వచ్చిందో? చూడ్డానికి పెద్ద మనిషిలాగా కనబడ తాడు దౌర్భాగ్యుడు... అని మనసులో కసిగా అనుకున్నాను. "లోపలకి రండి ఆంటీ!" అన్న ఆమె తియ్యని పిలుపుతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను. ఆ మాట, ఈ మాట చెప్పి అసలు విషయం తెలుసుకోవాలని అనుకున్నాను. కానీ ఆ పిల్ల మాట మాత్రానికైనా అతని గురించి చెడుగా చెప్పటం లేదు. గడుసుపిల్ల! ఇక లాభం లేదు. రంగంలోకి దూకి అసలు విషయం తెలుసుకొని ఏదో విధంగా నా వల్లకాకపోతే మా వారి చేతనైనా అతనికి నాలుగు చీవాట్లు పెట్టించాలి. అమాయకురాలికి అన్యాయం జరిగితే చూస్తు ఊరుకోకూడదు అని నిశ్చయించుకొని 'చూడమ్మా! నిత్య! కూలింగ్ గ్లాసెస్ బాగున్నాయి. ఎక్కడ కొన్నావు' అని మెల్లగా కదిపాను. 'బ్లూ ఆప్టికల్స్ ఆంటీ' అంది.

"ఇంట్లోనేగా ఉన్నావు... ఇప్పుడెందుకు పెట్టుకున్నావమ్మా వీటిని" అన్నాను తెలివిగా. "ఎక్స్‌క్యూజ్ మీ ఆంటీ... మీకు కాఫీ తెస్తానుండండి" అంటూ లేచి వంటింట్లోకి వెళ్లిపోయింది.

"పిచ్చిపిల్ల... చిన్నతనం సంసారం గుట్టు నలుగురికీ తెలీయకూడదనుకుంటోంది... సంస్కారవంతురాలు.

ఇలాంటి భార్య దొరకడానికి ఎంత పెట్టి పుట్టాలో! నిట్టూర్చాను. "ఆంటీ కాఫీ" అంది కమ్మని కంఠంతో పొగలు గ్రక్కే వేడి కాఫీ నాకు అందిస్తూ. "నాకు తెలుసమ్మా... నీ మనస్సు కూడా అలాగే పొగలు గక్కుతుంది. చదువుకున్నదానివి... బాధని పైకి కనబడకుండా జాగ్రత్త పడుతున్నావు... అనుకొన్నాను.

'చూడమ్మా నిత్య! ఆ గ్లాసెస్ ఓ మారు ఇటీవ్వమ్మా... చూసిస్తాను' అన్నాను... ఆమె కళ్ల జోడు తీస్తే కళ్ల గురించి అడగొచ్చు



అసలు విషయం బైటపడుతుంది. విలికి విలికి సమస్య గాలివానవక ముందే వారిద్దర్నీ ఒకటి చెయ్యాలి...

"సారీ ఆంటీ" అంది కళ్లజోడు తీయకుండా.

"పిచ్చిపిల్లా! ఆ కళ్లజోడు నువ్వెందుకు పెట్టుకున్నావో నాకు తెల్సు.

"నాతో దాచకుండా అన్ని విషయాలు చెప్పమ్మా... అసలు గొడవెందుకు వచ్చింది? మీరెందుకు ఎడమొగం, పెడమొగంగా ఉన్నారు?" అక్కసు పట్టలేక డైరెక్టుగా అడిగేసాను. ఆమె క్షణం తెల్లబోయింది.

"అబ్బే... అలాంటిదేమీ లేదండీ..." అంది కించిత్ ఆశ్చర్యంగా...

"నీ మొహమాటం బంగారం గాను! మీ. ఆయన నిన్ను కొట్టడం... నీ కళ్లుబ్బడం.... నేనేమన్నా అనుకుంటానని నువ్విలా కళ్ళజోడు పెట్టుకోవడం... అన్నీ నాకు తెల్సు తల్లీ... పెద్దదాన్ని ఆ మాత్రం వూహించ గలను... చెప్పు... గొడవెందుకు వచ్చింది?" అన్నాను.

ఆమె స్థాణువైపోయింది... మొహంలో రంగులు మారాయి...

"మీరు మమ్మల్ని అపార్థం చేసుకున్నారు... పెద్దవారు... మీరు... ఏదేదో ఊహించుకున్నారు... నాకు... వారికి మధ్య గొడవలేమి లేవు... నాకు "మద్రాసు ఐ" అంటే "కండ్ల కలక" లాంటిది వచ్చింది... ఇదొక వైరల్ ఇన్‌ఫెక్షన్... మూడ్రోజుల పాటు కళ్లెర్రగా వుబ్బినట్టు వుంటాయి. నీళ్లు కారుతుంటుంది. ఎదుటివారికి వెంటనే అంటుకునే ప్రమాదముంది. అందుకే మా వారితో సఖ్యతగా వుండలేక పోతున్నాను. గాగిల్స్ పెట్టుకోడానికదే కారణం అంది నిష్టూరంగా. ఈసారి తెల్లబోవడం నా వంతైంది.

"త్రాష్టుడు, దౌర్భాగ్యుడు" అంటూ అతన్ని ఏవేవో తిట్టుకొన్నాను... నా సంస్కారమేపాటిది? సిగ్గుతో చితికిపోయాను. ఏవేవో వూహించుకొని కల్పించుకొని 'అపోహ' పడ్డాను. 'నిత్య... నన్ను క్షమించమ్మా' అంటూ బలహీనంగా మా ఇంటికేసి అడుగులేసాను... అప్పటి నుంచి ఫాల్ల హాల్‌కేసి చూడ్డం మానేసాను. ●


రూ. 1,50,000 విలువైన బహుమతులు పొందండి
(ఎంట్రీ ఫీజు లేదు)



మొదటి బహుమతి: బజాజ్ స్కూటర్ లేదా వి.సి.ఆర్.,
కన్సొలేషన్ బహుమతులు: రూ. 800 లకు కలర్ టి.వి. లేదా రూ. 500 లకు జపాన్‌మోడల్ 'నేషనల్ టూ ఇన్ వన్' వైన్‌లింగ్ పథకం క్రింద.
ఒక పోస్టుకార్డుపై ఇక్కడ చూపినట్లు 9 గళ్ళు గీయండి. 12 నుంచి 20 వరకు అంకెలను ఉపయోగిస్తూ ఎటు కూడినా 48 వచ్చేటట్లు గళ్ళు నింపండి. ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను ఆర్డినరీ పోస్టులో పది రోజుల్లో పంపండి.
మొదట వచ్చిన 20 ఎంట్రీలకు ఫొటోగ్రాఫిక్ కెమేరా ఉచితం.

| | | |
|---|---|---|
| 14 | 13 | 18 |
| 19 | 15 | 11 |
| 12 | 17 | 16 |

| | | |
|---|---|---|
| 15 | | |
| | 16 | |
| | | 17 |

NATIONAL AGENCIES, (W-51), Post Box No: 4926,
S.J. Encl., NEW DELHI-110 029.